క్లుప్తంగా

నేడు బంటుమిల్లిలో ప్రజాదర్బార్

బంటుమిల్లి: పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు తెలిపారు. మండల పరిధిలోని నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు జానకీరామపురం గ్రామంలోని పార్టీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని గ్రామ సమస్యలపై అర్జీలు సమర్పించాలని వీరబాబు కోరారు.

కోడూరు ఎంపీడీఓగా సుధాప్రవీణ్



కోడూరు: కోడూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సుధాప్రవీణ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహించిన ఆర్.శ్రీనివాసరావు బదిలీపై గుంటూరు జిల్లా పెదకాకానికి వెళ్లారు. విధుల్లో చేరిన సుధాప్రవీణ్‌కు పంచాయతీ కార్యదర్శి ఉదయలక్ష్మి, ఉద్యోగులు పూల మొక్క అందించి, శాలువాతో సత్కరించారు.

విద్యుత్ కోతలపై జనాగ్రహం



కోడూరు: కోడూరు శివారు నాయుడుపేట గ్రామంలో పది రోజుల నుంచి రాత్రి వేళల్లో విద్యుత్ కోతలు విధిస్తున్నారంటూ శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో గ్రామస్తులు కోడూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. కోతలు విధించడానికి కారణం చెప్పాలంటూ అధికారులను నిలదీయగా, వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో గ్రామస్తులు కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. ద్విచక్రవాహనాలు రహదారికి అడ్డుగా పెట్టి గ్రామస్తులంతా రహదారిపై బైఠాయించి విద్యుత్ శాఖ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు వచ్చి గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విద్యుత్ శాఖ అధికారుల నుంచి సమస్య పరిష్కారంపై స్పష్టమైన హామీ వస్తే గాని ఆందోళన విరమించమని నాయుడుపేట గ్రామస్తులు చెప్పడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. విద్యుత్ అధికారులు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

లడ్డు వ్యవహారంలో కూటమి నేతలపై చర్యలు తీసుకోవాలి

మోపిదేవి: తిరుపతి లడ్డు వ్యవహారంలో ప్రజలను రెచ్చగొడుతున్న సీఎం చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత, స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, తెలంగాణకు చెందిన మాధవీలతపై చర్యలు తీసుకోవాలని అవనిగడ్డకు చెందిన యువ న్యాయవాది బడే గౌతమ్ డిమాండ్ చేశారు. మోపిదేవి ఎస్.విహార్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లడ్డు ప్రసాదంపై ప్రభుత్వ పెద్దలు చేస్తున్న ఆరోపణలు బాధ్యతారాహిత్యమని, దీనిపై సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కమిటీ నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. ఆధారాలు లేకుండా పవిత్రమైన లడ్డు ప్రసాదంపై నిందారోపణలు చేస్తూ కోట్లాది మంది హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా చేసిన కూటమి నాయకులపై అవనిగడ్డ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే అక్కడ రశీదు కూడా ఇవ్వలేదన్నారు. పైగా తనకు బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయని, తాను ఇలాంటి వాటిని లెక్కచేసే వ్యక్తిని కాదన్నారు. కూటమి అరాచకాలపై తన పోరాటం కొనసాగుతుందని తెలిపారు. త్వరలోనే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలుస్తానని చెప్పారు.



ఇంద్రకీలాద్రిలో శుక్రవారం అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

కుళ్లిన కోడిగుడ్లు సరఫరా

- గత మూడు నెలలుగా మాచవరం–1 అంగన్‌వాడీ కేంద్రంలో ఇదే తంతు
- శుక్రవారం ఒక మహిళకు పంపిణీ చేసిన 25 గుడ్లలో 15 గుడ్లు మురిగిపోయినవే వచ్చాయి
- ఫిర్యాదు చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చిన అంగన్‌వాడీ కార్యకర్త
- విచారణ నిర్వహించి మంచి గుడ్లు అందజేసిన అధికారులు



అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మిని విచారిస్తున్న సీడీపీవో గ్లోరీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గత మూడు నెలలుగా తమకు మురిగిన కోడిగుడ్లు ఇస్తున్నారంటూ మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారులకు నెలకు ఇస్తున్న 25 కోడి గుడ్లలో తరచుగా ఐదారు గుడ్లు మురిగిపోతున్నాయని వాపోతున్నారు. నగరంలోని మాచవరం –1 అంగన్‌వాడీ కేంద్రంలో ఆ ప్రాంతానికి చెందిన అలేఖ్య అనే మహిళ తనకు మురిగిన కోడిగుడ్లు ఇస్తున్నారంటూ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఐసీడీఎస్ సీడీపీవో గ్లోరీ, సూపర్‌వైజర్లు మాలతీదేవి, వెంకటేశ్వరమ్మ శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా అలేఖ్యను వారు ప్రశ్నించగా కేంద్రానికి వచ్చి తాను మురిగిన కోడిగుడ్ల విషయంపై అంగన్‌వాడీ కార్యకర్త ముక్కు లక్ష్మిని ప్రశ్నిస్తే కోడిగుడ్లలో నేనేమైనా దూరి చూశానా అని వ్యాఖ్యానించిందని వాపోయారు. శుక్రవారం ఇచ్చిన 25 కోడిగుడ్లలో 15 గుడ్లు మురిగిపోయాయని చెప్పారు. వాటిని ఉడికించగా బాగానే ఉన్నాయని, పెంకు తీసేసరికి దుర్వాసన వస్తున్నాయని తెలిపింది. సెల్‌ఫోన్‌లో కుళ్లిపోయిన గుడ్ల ఫొటోలను విచారణకు వచ్చిన అధికారులకు చూపించింది. మీకు కూడా కుళ్లిన కోడిగుడ్లు వస్తున్నాయా అని ఇతర లబ్ధిదారు మహిళలను సీడీపీవో గ్లోరీ ప్రశ్నించగా గత మూడు నెలలుగా ప్రతి నెలా తమకు రెండు, మూడు గుడ్లు కుళ్లినవి వస్తున్నాయని తెలిపారు. తనకు మాత్రం ప్రతి నెల ఐదారు గుడ్లు కుళ్లినవి వస్తున్నాయని ప్రతిసారి కార్యకర్త లక్ష్మికి ఫోన్ చేసి చెబుతున్నానని అలేఖ్య వివరించింది. ఇకపై కుళ్లిన గుడ్లు వస్తే వాటిని తీసుకువచ్చి కార్యకర్తకు చూపితే వేరే గుడ్లు ఇస్తారని సీడీపీవో తెలిపారు. ఎక్కువ మొత్తంలో కుళ్లిన గుడ్లు వస్తే తాము ఇతర కేంద్రాలకు సరఫరా చేసిన గుడ్లను పిల్లలకు ఇవ్వకుండా మంచిగుడ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకునేందుకు వీలు ఉంటుందని తల్లులకు వివరించారు. కుళ్లిన 15 గుడ్ల స్థానంలో వేరే గుడ్లను అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి ద్వారా అలేఖ్యకు ఇప్పించారు.



కుళ్లిన గుడ్ల ఫొటోలను సీడీపీవోకు చూపుతున్న లబ్ధిదారు అలేఖ్య

జగన్మాతా...నమోస్తుతే!



పెదతుమ్మిడి శివాలయంలో శ్రీబాలత్రిపురసుందరీదేవీగా...



శ్రీగాయత్రీదేవి అలంకరణలో పెడన పైడమ్మ అమ్మవారు



నాగాయలంక కృష్ణానదీతీరంలో గాయత్రీ దేవిగా కనకదుర్గమ్మ



కృత్తివెన్నులో కుంకుమార్చన చేస్తున్న భక్తులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు అమ్మవారి ఆలయాల్లో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం అమ్మవారిని ధనలక్ష్మీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. బృందావన పుర ప్రార్థనా సంఘం, గీతామందిరంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీ ధనలక్ష్మీ దేవిగా, శ్రీ లలితా అమ్మవారు శ్రీ గజలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో అమ్మవారు బాలత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. ఈడేపల్లి శక్తిగుడిలో శక్తి అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. రేవతి సెంటరులో ఉన్న గంగానమ్మ అమ్మవారి ఆలయం, బెల్లంకొట్ల సందులోని మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం, రాజుపేటలోని ముచ్చం గుడి, ప్రధాన రహదారి విజయ దుర్గాదేవి ఆలయం తదితర ఆలయాల్లో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

బంటుమిల్లిలో...

బంటుమిల్లి: స్థానిక శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం, శ్రీ పాశ్వాపురం గ్రామంలోని శ్రీసువర్చలాంజనేయస్వామి, మల్లేశ్వరం రామాలయంలో, లక్ష్మీనారాయణపురంలో అమ్మవార్లను శ్రీ గాయత్రీ దేవిగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. పెదతుమ్మిడి లోని శ్రీ పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని శ్రీ బాలత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. బంటుమిల్లి రామాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవార్లను శ్రీ ధనలక్ష్మీ దేవీగా తీర్చిదిద్ది సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మల్లంపూడి, చోరంపూడి, ముంజులూరు గ్రామాల్లో అమ్మవారి ప్రతిమలు నిలిపి భక్తులతో కుంకుమ పూజలు నిర్వహించారు.

పెడనలో...

పెడన: పట్టణంలో పైడమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని రెండో రోజు శ్రీగాయత్రీదేవిగా అలంకరించారు. చెన్నకేశవుల బేబీ గురునాథం, శ్రీదేవి దంపతులతో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కాలేపు నాగేశ్వరరావు, జయనాగేశ్వరి, రుద్రమూర్తి ప్రసాదం అందజేశారు. శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. గాయత్రీదేవి హోమం, సామూహిక కుంకుమార్చనలు, నైవేద్య నీరాజన కార్యక్రమాలతో పాటు లలితాపారాయణం, సౌందర్యలహరి పఠనం గావించారు. తెల్ల చామంతులతో అమ్మవారికి పూజలు చేశారు.

కృత్తివెన్నులో...

కృత్తివెన్ను: కృత్తివెన్ను శివాలయంలో ధనలక్ష్మీదేవిగా, అడ్డపర్రలో బాలాత్రిపురసుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల వద్ద భక్తులు కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీరామపాదక్షేత్రంలో...

నాగాయలంక: స్థానిక కృష్ణాతీరం శ్రీరామపాద క్షేత్రం సముదాయంలోని శ్రీకనక దుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారిని శుక్రవారం గాయత్రీదేవిగా విశేష అలంకారంలో భక్తులు దర్శనం చేసుకున్నారు. చుండూరు సాయి రుషి, శోభాదేవి దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించగా ఉత్సవ పీఠం వద్ద పీటలపై కూర్చుని అమ్మవారికి విశేషపూజ, అభిషేకాలు, హోమం జరిపారు. గ్రామంలోని ప్రసిద్ధ శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీవాసవీ కన్యకాంబను రజత కవచ శ్రీమహాలక్ష్మీ దేవిగా, శ్రీపార్వతీ అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. ప్రధాన కలశ పీఠం వద్ద చిట్టా శివనాగేశ్వరరావు–రాజరాజేశ్వరి దంపతులు ఉత్సవ నిత్య పూజ, యాగశాలలో గాయత్రీ హోమం జరిపారు. మండలంలోని గణపేశ్వరంలో శ్రీదుర్గా, గణపేశ్వరస్వామి ఆలయాలలో శుక్రవారం దుర్గమ్మ శ్రీబాల త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భావదేవరపల్లిలో శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో, గ్రామదేవత అంకాలదేవర ఆలయంలో అమ్మవార్లను గాయత్రీదేవిగా అలంకరించారు.

మోపిదేవిలో...

మోపిదేవి: మండలంలో రెండోరోజు శుక్రవారం పలు దేవాలయాలతో పాటు ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్ల కింద ఏర్పాటు చేసిన దుర్గమ్మ తల్లిని గాయత్రీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, హారతులు అందించారు. పెదకళ్లేపల్లి శ్రీ దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి ఆలయం, కొక్కిలిగడ్డ శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామివారి ఆలయంలో దుర్గామాతను గాయత్రీదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మోపిదేవి బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి కేసగాని ఫణీంద్ర కుమార్ దంపతులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు.



కొక్కిలిగడ్డలో గాయత్రీదేవిగా...



కోడూరులో గాయత్రీదేవిగా...

కోడూరులో...

కోడూరు: శ్రీదేవీ శరన్నవరాత్రులు రెండవ రోజైన శుక్రవారం అమ్మవార్లు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోడూరులోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కనకదుర్గమ్మను గాయత్రీదేవిగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. వంతెన సెంటర్‌లోని గంగాభవాని, విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ, కోడూరు దానాశక్తి, మందపాకల నాంచారమ్మ అమ్మవార్లను కూడా గాయత్రీదేవిగా అలంకరించారు. మాచవరం తుంగపల్లెమ్మ, లింగారెడ్డిపాలెం బాలాత్రిపుర సుందరీ దేవి, హంసలదీవి కాశీ అన్నపూర్ణ అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు చేశారు. ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

గూడూరు: గూడూరులోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరిన అమ్మవారిని శుక్రవారం శ్రీ అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. స్థానిక కొల్లువారి వీధిలోని రామాలయంలో స్థానిక యువకులు దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.



ప్రత్యేక అలంకారంలో విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ



గూడూరు కొల్లువారి వీధి రామాలయంలో...



మచిలీపట్నం గీతామందిరంలో ధనలక్ష్మీ దేవిగా...



మచిలీపట్నం దత్తాశ్రమంలో పూజలు నిర్వహిస్తున్న సువాసినీలు

గూడూరులో టీడీపీ X జనసేన

- టీడీపీ నేత విపరీత ధోరణిపై ఎమ్మెల్యేకు జనసేన నాయకుల ఫిర్యాదు
- ఫిర్యాదుపై ఎమ్మెల్యే స్పందించకపోవడంతో జనసేనానికి ఫిర్యాదు
- 6న కంకటావ గ్రామంలో నిరసన దీక్షకు జనసేన నేతల సన్నద్ధం

పెడన: పెడన నియోజకవర్గంలోని ఎన్డీయే కూటమిలో విభేదాలు భగ్గుమంటున్నాయి. ఇప్పటి వరకు పైకి కనిపించకపోయినా టీడీపీ, జనసేన మండల స్థాయి నాయకుల మధ్య ఒకరంటే మరొకరికి మింగుడుపడని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా గూడూరు మండల టీడీపీ నాయకుల అక్రమాలు, విపరీత ధోరణి, బహిరంగ సభలలో అసభ్య, అశ్లీల పదజాల ప్రయోగాలపై జనసేన మండల నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు తెలియజేసినా అలా మాట్లాడవద్దని చెబుతున్నా టీడీపీ నాయకులు వినిపించుకోకపోవడంతో టీడీపీ, జనసేన మండల నాయకుల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఎమ్మెల్యేకు సదరు టీడీపీ నాయకుల తీరు గురించి ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో మండలంలోని జనసేన నాయకులు మరింత అసంతృప్తితో రగిలిపోతున్నారు. వందరోజుల పాలనపై మండలంలో పలు కార్యక్రమాలను ఎన్డీయే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నా జనసేన నాయకులు హాజరు కావడం లేదు. ఇటీవల జరిగిన కంకటావ గ్రామసభలో మండల టీడీపీ నాయకుడిని జనసేన నాయకుడొకరు ఎదురు ప్రశ్నించినందుకు మొత్తం మండలంలోని జనసేన నాయకులను ఇష్టానుసారంగా తిట్టడమే కాకుండా కుటుంబ సభ్యులను కూడా కలిపి తిట్టి అవమానించిన పరిస్థితిని జనసేన నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రస్తుతం పంచాయతీలలో జరుగుతున్న గ్రామసభలకు జనసేన పార్టీ నుంచి ఎవరూ పాల్గొనకూడదని నిర్ణయించుకున్నారు. మండల టీడీపీ నాయకుల అవినీతి, అక్రమాలు, ఉద్యోగులపై విపరీత ధోరణి విధానాలను కంట్రోల్ చేయలేకపోవడం, అంగన్వాడీ, డ్వాక్రా మహిళలు ఫిర్యాదులు చేసినా ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంతో పరిస్థితి మరింత దిగజారిందని, ఈ విషయాన్ని జనసేనానికి ఫిర్యాదు చేసినట్లుగా మండల జనసేన నాయకులు చెబుతున్నారు. జనసేనని దూరం చేసుకుంటే నష్టపోయేది ఎమ్మెల్యే మాత్రమేననే విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. టీడీపీ మండల నాయకుడి వ్యవహారశైలికి నిరసనగా ఈ నెల 6వ తేదీన గూడూరు మండలం కంకటావ గ్రామంలో ఉదయం 9 గంటలకు నిరసన దీక్ష చేయడానికి సిద్ధమైనట్లు, జనసేన పార్టీ శ్రేణులు తరలి వచ్చి సంఘీభావం తెలియజేయాలని కోరుతూ వాట్సప్ గ్రూప్‌లలో మెసేజ్‌లు ఫార్వర్డ్ అవుతుండటంతో నియోజకవర్గంలో సంచలనం రేపుతోంది. ఈ మెసేజ్‌లను ఎవరూ ఖండించకపోవడం గమనార్హం.

రెండో రోజూ ఆకట్టుకున్న తాళ భజన పోటీలు

చిట్టూర్పు(ఘంటసాల):మండలంలోని చిట్టూర్పు గ్రామంలో నిర్వహిస్తున్న కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల స్థాయి తాళ భజన పోటీలు రెండో రోజు విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామంలోని శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన పోటీల్లో శ్రీ వెంకటేశ్వర భజన సమాజం(వక్కలగడ్డ), శ్రీ రామాంజనేయ భజన సమాజం(పూషడం), హిందూ ధర్మ భజన సమాజం(కోడూరు), సదాశివలింగేశ్వర భజన సమాజం(పెడన), గీతాకృష్ణ భజన సమాజం(వీరవల్లి) భక్తి గీతాలను శాస్త్రోక్తంగా, లయబద్ధంగా ఆలపించారు. న్యాయనిర్ణేతలుగా పాడుగు ప్రభాకరరావు, ఏసుపాదం వ్యవహరించారు. అనంతరం భజన పోటీల నిర్వాహక కమిటీ సభ్యుడు గుత్తికొండ వర ప్రసాద్‌ను కోడూరుకు చెందిన విశ్వహిందూ పరిషత్ సభ్యులు, గ్రామస్తులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుత్తికొండ రాజ్యలక్ష్మి, నిర్వాహక కమిటీ సభ్యులు వేములపల్లి సుధీర్, దాసరి సతీష్, దాసరి సురేష్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీ అమలు కోరుతూ ధర్నా



కోనేరుసెంటరులో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



బంటుమిల్లిలో ఉచిత ఇసుక కోసం నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

మచిలీపట్నంటౌన్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుకను అమలు చేయాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ, భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో వేరువేరుగా ధర్నా కార్యక్రమాలు జరిగాయి. స్థానిక కోనేరుసెంటరులో సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు ఇసుక కొరత వల్ల జీవనం అస్తవ్యస్తమైందన్నారు. అనేక మంది పనులు లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం వచ్చి 100 రోజులు దాటినా పనులు లేని పరిస్థితి ఏర్పడిందని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించి కార్మికులకు ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, జిల్లా కమిటీ సభ్యుడు సీహెచ్ రాజేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.పోలినాయుడు, సీనియర్ నాయకులు కొడాలి శర్మ, టి.చంద్రపాల్, ఎండీ యూనస్, పరసా లక్ష్మి, ఐద్వా నగర కార్యదర్శి కొడాలి సుజాత, బూర భవాని తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక సరఫరా చేయాలి

బంటుమిల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక అందచేసి భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని కోరుతూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ దళారులు ట్రాక్టరు ఇసుక రూ.6వేలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు నాలుగు నెలలు అవుతున్నా ఇసుక కొరతతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇసుక క్వారీలను తెరిచి ప్రజలకు ఉచిత ఇసుక అందజేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ, రైతు సంఘ నాయకులు జి.నాగేశ్వరరావు, బి.నాగరాజు, పి.వెంకటేశ్వరరావు, ఎల్.అజయ్‌ఘోష్, పలు గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.



మొక్కను అందజేస్తున్న హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. రత్నశ్రీ



మొక్కను అందజేస్తున్న హౌసింగ్ పీడీ ఎస్.వెంకట్రావు



కలెక్టర్ డీకె బాలాజీకి మొక్కను అందజేస్తున్న డ్వామా పీడీ ఎన్వీ శివప్రసాద్ యాదవ్



కలెక్టర్ బాలాజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దేవదాయశాఖ ఏసీ ఎన్వీ సాంబశివరావు

అధికారుల మర్యాదపూర్వక కలయిక

ఇటీవల బదిలీల్లో కృష్ణాజిల్లాకు కేటాయించిన పలువురు జిల్లా అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వారు ముందుగా కలెక్టర్ బాలాజీని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, మొక్కలు అందజేశారు.

– చిలకలపూడి(మచిలీపట్నం)

సంక్షిప్త వార్తలు

■ అవనిగడ్డ డీఎస్పీ బదిలీ

అవనిగడ్డ: అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్ బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మురళీధర్ విజయవాడ సీఎస్‌బీకి బదిలీ అయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న బొంతు శ్రీనివాస్ అప్పా డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు.

■ చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత

మచిలీపట్నంటౌన్: నగరంలోని జిల్లా కోర్టు సెంటర్‌లో కూరగాయలు, మొక్కజొన్న పొత్తులు విక్రయించే ఇరువురు చిరు వ్యాపారులకు విజయవాడ హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకుడు చందన వెంకట్ శుక్రవారం తోపుడు బండ్లను అందజేశారు. స్థానిక జిల్లా కోర్టు సెంటర్‌లో వ్యాపారాలు చేస్తున్న బాదర్ల వెంకటేశ్వర్లు, షేక్ రసూల్‌బీలకు వీటిని అందజేశారు.

■ రిలీవ్ అయిన విద్యుత్‌శాఖ ఈఈ భాస్కరరావు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం సబ్ డివిజన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మన్నెం భాస్కరరావు శుక్రవారం విధుల నుంచి రిలీవయ్యారు. ఆయన శనివారం విజయవాడలో ఉమ్మడి కృష్ణాజిల్లా నోడల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

■ విధుల నుంచి రిలీవ్ అయిన ఆర్ఐ, వీఆర్వోలు

పెడన: తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న మణికుమార్ మచిలీపట్నంకు బదిలీ కావడంతో శుక్రవారం ఆయన రిలీవ్ అయ్యారు. ఆయనతో పాటు మరో తొమ్మిది మంది వీఆర్వోలు కూడా బదిలీలపై రిలీవ్ అయ్యారు. వీరందరికీ కార్యాలయ సిబ్బంది, ఇతర వీఆర్వోలు, ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

■ బదిలీ అయిన ఉద్యోగులకు సత్కారం

మోపిదేవి: మండలంలోని నాగాయితిప్ప గ్రామ పంచాయతీలో పనిచేసి బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లిన ఉద్యోగులను శుక్రవారం సన్మానించారు. గ్రామ సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. మోపిదేవి పంచాయతీ కార్యాలయంలో బదిలీలు అయిన ఉద్యోగులను గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. చల్లపల్లి మండలంలో వీఆర్వోగా పనిచేస్తూ ఓగిరాల నాగమల్లేశ్వరరావు బదిలీపై పెదప్రోలుకు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీ విద్య తెలిపారు.

కోడూరు: ఎంపీడీఓగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఆర్.శ్రీనివాసరావు, మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహించి బదిలీ అయిన ఆకుల పాండురంగారావు, బదిలీపై వెళ్లిన పంచాయతీరాజ్ ఏఈ వేముపల్లి విజయకుమార్‌లను సత్కరించారు. వీరికి కార్యదర్శులు జ్ఞాపికలు అందించి దుశ్శాలువాలతో సన్మానించారు. కోడూరు పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన కొప్పనాతి రాంప్రసాద్‌ను పంచాయతీ సిబ్బంది సన్మానించారు.

ఘంటసాల: ఘంటసాల మండలం ఈఓపీఆర్డీగా కె.వెంకటేశ్వరరావు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్‌గా వి.శ్రీనివాసరావు, చినకళ్లేపల్లి పంచాయతీ కార్యదర్శిగా, మల్లంపల్లి ఇన్‌చార్జి ఈవోగా అబ్దుల్ నయూమ్, తాడేపల్లి గ్రేడ్ 5 ఈవోగా టి.రాజశేఖర్, మండల పరిషత్ సబ్ ఆర్డినేటర్‌గా గుర్రం రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బారావు ఆధ్వర్యంలో సహోద్యోగులు వారిని ఘనంగా సన్మానించారు.

■ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం శివారు నక్కవానిదారి గ్రామానికి చెందిన పచ్చా వీరబాబు కుటుంబసభ్యులతో కలిసి రోజూ మాదిరిగానే గురువారం రాత్రి తన నివాస గృహంలో నిద్రపోయాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఇంటి పైకప్పు నుంచి మంటలు రావడాన్ని గమనించి హుటాహుటిన కుటుంబసభ్యులను నిద్రలేపి బయటకు పరుగులు తీశారు. ఇంటితో పాటు పశువుల చావిడి మొత్తం అగ్నికి ఆహుతైంది. అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో నాలుగు పశువులకు తీవ్ర గాయాలవగా, ఒక ద్విచక్రవాహనం, రెండు సైకిళ్లతో పాటు విలువైన పత్రాలు దగ్ధమైనట్లు బాధితుడు వీరబాబు తెలిపారు. బాధితుడిని వివిధ రాజకీయ పార్టీ నేతలు పరామర్శించారు.

■ అగ్నిప్రమాద బాధితునికి సీఐ ఆర్థిక సహాయం

అగ్ని ప్రమాద బాధితుడు వీరబాబుకు అవనిగడ్డ సీఐ యువకుమార్ రూ.10వేల నగదును అందించారు. బాధితుడికి దాతలు తోడ్పాటునివ్వాలని సీఐ విజ్ఞప్తిచేశారు.